క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సరస్వతీ హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై సోమవారం సరస్వతీ హోమం చేశారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని మల్లేశ్వరస్వామివారి ఆలయం సమీపంలోని యాగశాలలో అర్చకులు యాగాన్ని జరిపించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు ప్రసాదించాలని, వార్షిక పరీక్షలు, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని కాంక్షిస్తూ ప్రతి నెలా మూలా నక్షత్రం రోజున అమ్మవారి సన్నిధిలో హోమం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. దేవస్థాన వేద పాఠశాల విద్యార్థులు హోమంలో పాల్గొనగా, పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు జరిపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కండ్రిక మెయిన్ రోడ్, సుబ్బారెడ్డి స్కూల్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న ధార్మిక ఉపన్యాసం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో డాక్టర్ అనంతలక్ష్మి ధార్మిక ఉపన్యాసం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద భవానీ సేవాధారులు వివిధ పుష్పాలతో శ్రీచక్రాన్ని తీర్చిదిద్దారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధార్మిక ఉపన్యాసం ఇవ్వగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఈఓ రామరావు మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఆధ్యాత్మికతను పెంచే కార్యక్రమాలను చేపట్టడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అనంతలక్ష్మి, భవానీ సేవాధారులకు అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఇతర అర్చకులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చడానికి..



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బాటసారుల దాహార్తిని తీర్చడానికి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషమని ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) వైస్ ప్రెసిడెంట్ గోనుగుంట వెంకట సుబ్బారావు అన్నారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్ సమీపంలో ఉన్న 'అమ్మ' ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. వెంకట సుబ్బారావు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఏటా వేసవి కాలం మొదలైనప్పటి నుంచి ముగిసేంత వరకు చలివేంద్రాన్ని నిర్వహిస్తూ అందులో రక్షిత నీటితో పాటుగా మజ్జిగను కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. 'అమ్మ' కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, 'అమ్మ' మాజీ అధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, మిరియాల వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ఎంవీ ప్రసాద్ పాల్గొన్నారు.

మెట్ల మార్గంలో భక్తురాలికి అస్వస్థత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మల్లేశ్వరస్వామి వారి ఆలయం మెట్ల మార్గంలో ఓ భక్తురాలు అస్వస్థతకు గురైన ఘటన సోమవారం ఇంద్రకీలాద్రిపై చోటు చేసుకుంది. ఆమెను ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలుస్తోంది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గుంటూరు జిల్లాకు చెందిన ఓ భక్తురాలు తన కుమార్తెతో అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా, యాగశాల సమీపంలో అస్వస్థతకు గురై కిందపడిపోయారు. ఇంతలో తోటి భక్తులు దేవస్థాన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని లిఫ్ట్ మార్గం ద్వారా కిందకు దింపారు. దేవస్థాన అంబులెన్స్ ద్వారా నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షల అనంతరం వైద్యులు ఆమె మృతి చెందినట్లు సమాచారం తెలిసింది.

మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం

సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



వాంబే కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా సోమవారం 61వ డివిజన్ వాంబే కాలనీ హెచ్ బ్లాక్ అపార్టుమెంట్లలో ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ వాంబే కాలనీలో ప్రజలందరూ సీఎం జగనన్న పరిపాలనకు మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

పెన్షన్ల పంపిణీకి అడ్డుపడుతున్న కూటమి..

ప్రభుత్వం ప్రతీ నెలా పేదలకు, దివ్యాంగులకు అందజేస్తున్న సామాజిక పెన్షన్లు వలంటీర్ల ద్వారా ఇవ్వకుండా శిఖండుల్లా కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరితో పాటు షర్మిల అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమ్మగడ్డ రమేష్‌ను అడ్డం పెట్టుకొని కుతంత్రాలు పన్నుతున్నారన్నారు. నిమ్మగడ్డ చంద్రబాబు, పురందేశ్వరి, పవన్‌కల్యాణ్‌కు పాలేరులా పని చేస్తున్నారన్నారు. జగనన్న ఇస్తున్న పథకాలను ఆపేయాలని నీచ రాజకీయాలకు వారు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నిమ్మగడ్డ రమేష్‌కు వలంటీర్లకు సంబంధం ఏమిటని వెలంపల్లి ప్రశ్నించారు. చంద్రబాబు, పురందేశ్వరి, పవన్‌కల్యాణ్‌తో పాటు షర్మిలకు కూడా బుద్ధి లేదన్నారు. దేవుడు అన్ని చూస్తున్నాడని, నీచ రాజకీయాలు చేసే వారికి ఈ సారి మూడు సీట్లు కూడా రావన్నారు. టిప్పర్ డ్రైవర్‌కు సీటు ఇస్తే తప్పా చంద్రబాబు అని ప్రశ్నించారు. నీకు, నీ కుటుంబానికి డ్రైవర్లు కావాలి, డ్రైవరు ఎమ్మెల్యే కాకూడదా అని ప్రశ్నించారు. ఒకప్పుడు ఎస్సీలుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని అన్నావ్. పేదలు బతుకుతుంటే ఓర్వలేని చంద్రబాబు పైన 60 లక్షల మంది పెన్షన్లు పొందుతున్న వారు త్వరలోనే కక్ష తీర్చుకుంటారని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు తీసుకుని తమ అవసరాలు తీర్చుకుంటున్న దివ్యాంగులు, వృద్ధులను ఏడిపిస్తున్నారని అన్నారు. తాగుబోతు బొండా ఉమా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. తాగుబోతులకు ఓట్లు వేయవద్దని తెలిపారు. ప్రజలు రెండు నెలలు ఓపిక పట్టండి జగనన్న ప్రభుత్వమే మళ్లీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు నిమ్మగడ్డ రమేష్ హైదరాబాదులో లాబీయింగ్ చేయలేదా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలవకూడదని ప్రయత్నాలు చేసినా తిరుగులేని విధంగా జగన్‌ను విజయం వరించిందన్నారు. లోకేష్‌కు జడ్ కేటగిరి ఎందుకో అర్థం కావడంలేదన్నారు. మంగళగిరిని మందళగిరి అంటూ సరిగ్గా పలకలేని వ్యక్తి లోకేష్ అని విమర్శించారు. పర్యటనలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, పార్టీ జిల్లా సెక్రటరీ మేడా రమేష్, మైనార్టీ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్‌మీరా, బెజ్జం రవికుమార్, ఉమ్మడి వెంకట్రావ్, ఆర్ఎస్ నాయుడు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.త్రివేణిరెడ్డి, జిల్లా కార్యదర్శి టి.వరలక్ష్మి, నాగమణి, సత్యనారాయణ, దుర్గాప్రసాద్‌రెడ్డి, పదిలం రాజశేఖర్ పాల్గొన్నారు.



62వ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

62వ డివిజన్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): ఎన్నికల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం 62వ డివిజన్ ఏపీఎస్ రెడ్డి రోడ్డు, చలసాని సూర్యప్రకాశరావు స్కూల్ వెనుక వైపు, రాధానగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దుర్మార్గుడు చంద్రబాబు వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీని అడ్డుకున్నారని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామున అందే పింఛన్లు అందకపోవడానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి కారణమని ఆరోపించారు. రెండు నెలల్లో వైఎస్సార్ సీపీ గెలవడం.. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇంటికి తీసుకొచ్చి అవ్వాతాతలకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్యటనలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, స్థానిక కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి, పార్టీ నాయకుడు అలంపూరు విజయ్‌కుమార్, కో–ఆప్షన్ ఎస్ జగదీష్, ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యదర్శి మేడా రమేష్, డివిజన్ కో–ఆర్డినేటర్ వీరబాబు, రామిరెడ్డి, బుజ్జి, రమేష్, సూపర్‌బజార్ డైరెక్టర్ గ్రేసీ, జిల్లా మహిళ జాయింట్ సెక్రటరీ వేము హైమావతి తదితరులు పాల్గొన్నారు.

రాక్షసానందం పొందుతున్న చంద్రబాబు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అవ్వాతాతలకు ఒకటో తేదీన పింఛన్ అందకుండా చేసి చంద్రబాబు అండ్ కో రాక్షస ఆనందం పొందుతున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలోని అవ్వాతాతలు, దివ్యాంగులు ఒకటో తేదీన వచ్చే పింఛన్ కోసం వేయి కళ్లతో ఎదురు చూసిన వారికి మొట్టమొదటిసారి టీడీపీ నాయకుల నీచ రాజకీయాలతో నిరాశే మిగిలిందని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇన్ని నెలలూ ఠంచన్‌గా ఒకటో తేదీన తెల్లవారుజాము కల్లా 95 శాతం వరకూ పింఛన్ల పంపిణీ జరిగేదని.. కానీ ఈ నెల ఇంకా జరగకపోవడానికి బాబు, అతని జేబు సంస్థలే ప్రధాన కారణమని ఆరోపించారు. ఓవైపు నిమ్మగడ్డ రమేష్ ద్వారా సామాజిక పింఛన్లను అడ్డుకుని.. మరోవైపు సకాలంలో ఇచ్చేయాలంటూ వర్ల రామయ్య, దేవినేని ఉమా సీఈఓను కలవడం బాబు డబుల్ స్టాండ్‌కు అద్దం పడుతోందని విమర్శించారు. మరోవైపు రాష్ట్రంలో ఉద్యోగాలే లేనట్లు ఐదేళ్లు నానా యాగీ చేసిన బాబు అండ్ కో.. ఇప్పుడు సచివాలయాల్లో 1.30 లక్షల ఉద్యోగులు ఉన్నట్లు లేఖలో పేర్కొనడంపై ఏం సమాధానమిస్తారని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితులు మరలా ఎక్కడ వస్తాయోనన్న భయాందోళనలో దివ్యాంగులు, అవ్వాతాతలు ఉన్నారని.. ఈ ఎన్నికల్లో వారంతా ముందు వరుసలో నిలబడి టీడీపీని చిత్తు చిత్తుగా ఓడించడం ఖాయమని స్పష్టం చేశారు.

సేవకు ప్రతిరూపం నాగమల్లీశ్వరి



నాగమల్లీశ్వరిని సత్కరిస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సేవకు ప్రతిరూపం కోరంగి నాగమల్లీశ్వరి అని ఆమె చేస్తున్న సేవలను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని తోటివారికి సాయం చేయాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ అన్నారు. హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా సోమవారం బీఆర్‌టీఎస్ రోడ్డులో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు అందించడం అభినందనీయం అన్నారు. సత్కార గ్రహీత నాగమల్లీశ్వరి మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్‌తో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, హేమంతరావు, సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, జీ ఏడుకొండలు, కే వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరానికి ఎన్నికల స్పెషల్ జనరల్ అబ్జర్వర్



మిశ్రాకు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి మీనా, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఏపీ స్పెషల్ జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన రిటైర్డు ఐఏఎస్ అధికారి రామ్‌మోహన్ మిశ్రా నగరానికి విచ్చేశారు. సోమవారం ఢిల్లీ నుంచి నగరానికి చేరుకున్న ఆయనకు నోవాటెల్ వద్ద రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ స్వాగతం పలికారు.

టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో మంచి అవకాశాలు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాలిటెక్నిక్ కోచింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ పేద విద్యార్థుల సౌకర్యార్థం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ప్రతీ ఏటా ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. 10 పూర్తయిన తర్వాత అనేక అవకాశాలు ఉన్నాయని వాటిలో ముఖ్యంగా పాలిటెక్నిక్ చదివితే వెంటనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఈ నెల 27 తేదీన జరిగే పాలీసెట్ ప్రవేశ పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, నగర నాయకులు కుమారస్వామి, మాధవ్, భార్గవ, సంతోష్, పృథ్వీ, యశస్విని, మణికంఠ, జ్వాలిత తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అర్చకుల అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై అర్చకులకు అంతర్గత బదిలీ చేస్తూ ఈఓ కె.ఎస్.రామరావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అంతరాలయంలో మొదటి షిఫ్టు ప్రధాన అర్చకులు ఎల్.దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చక ఎం.వి.రామమూర్తి, ముఖ్యఅర్చక పి. రామకృష్ణ, అర్చక నేతి ప్రసాద్‌కు కేటాయించారు. రెండో షిఫ్టులో ప్రధాన అర్చక కె. వెంకట కనక సుందరశర్మ, ముఖ్యఅర్చక పీవీకేఎస్ కామేశ్వరరావు, ముఖ్య అర్చక ఆర్.శ్రీనివాసశాస్త్రి, అర్చక వైఎస్ ఉమాకాంత్‌శర్మకు కేటాయించారు. మూడో షిఫ్టు ప్రధాన అర్చక ఎల్వీఎస్ బద్రీనాథ్‌బాబు, ఉప ప్రధాన అర్చక బి.శంకర్ శాండిల్య, ముఖ్య అర్చక కె.హరి వాసుదేవకుమార్, అర్చక బి.ప్రవీణ్‌కుమార్‌కు కేటాయించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రధాన అర్చకులు వై. మల్లేశ్వర శాస్త్రి, సత్యనారాయణమూర్తితో పాటు మూడు షిఫ్టుల్లో పి. జగన్మోహనరావు, మొవ్వ శ్రీనివాస్, కేవీ శివకుమార్, రెండో షిఫ్టులో జె. మోహన్‌బాబు, పి. శ్రీనివాసశర్మ, ఆర్.దుర్గాప్రసాద్‌లకు మూడో షిఫ్టులో డి. శివ సుబ్బారావు, పీవీఎస్ఎన్ మూర్తి, ఎల్. వెంకటేశ్వర శర్మలకు విధులు కేటాయించారు. వీరితో పాటు ధర్మ దర్శనం, శివ కామసుందరీ సమేత నటరాజ స్వామి వారి ఆలయం, నాగేంద్రపుట్ట, గోపూజ, అష్టోత్తరం, అద్దాల మండపం, ఇతర ఉపాలయాల్లో విధులు నిర్వహించే అర్చకులను అంతర్గత బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ భవానీశంకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఆర్డీఓ, తూర్పు నియోజకవర్గ ఆర్వో బీహెచ్ భవానీశంకర్ సోమవారం చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారధి, ఆటోనగర్, రామవరప్పాడు రింగ్ చెక్‌పోస్టులను తనిఖీలు చేశారు. వాహనాలు తనిఖీ చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. అక్రమంగా నగదు, మద్యం, విలువైన లోహాలు వంటి వాటి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతర నిఘా, అప్రమత్తతతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎంసీసీ బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్) పటిష్ఠ అమలుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధికారులు కృషి చేయాలని భవానీశంకర్ సూచించారు. ఆర్డీఓతో పాటు పోలీస్, మునిసిపల్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

అల్లా ఆశీస్సులతో ప్రజలు సుఖంగా ఉండాలి



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

పాయకాపురం(విజయవాడరూరల్): అల్లా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం శాంతినగర్ మహమ్మదీయ మస్జిద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ పరమ పవిత్రమైన రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు విరమణ సమయంలో జరిగే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం మసీద్ ఇమామ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును మత పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఖాజా, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్‌మీరా, అఫీజుల్లా, మసీదు పెద్దలు బాషా, స్థానిక నాయకుడు మల్లీ తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులకు పింఛన్ కష్టాలు

- పింఛన్ కోసం దివ్యాంగులు, అవ్వాతాతల ఎదురుచూపులు
- టీడీపీ వైఖరితో లబ్ధిదారులకు ఇబ్బందులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గతంలో పింఛన్‌దారులు పింఛన్ తీసుకోవాలంటే అనేక ఇబ్బందులు పడాల్సివచ్చేది. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయం, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. దీంతో వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల గడప వద్దనే అందజేస్తున్నారు. ముఖ్యంగా పింఛన్లను ఠంచన్‌గా ప్రతి నెలా ఒకటో తేది వేకువజామునే లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. కానీ చంద్రబాబు అనుబంధ సంస్థలకు చెందిన కొందరు వ్యక్తులు ఎన్నికలను సాకుగా చూపి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకూడదని ఈసీకి ఫిర్యాదు చేసి వారి సేవలను నిలిపివేశారు. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతులు పింఛన్ తీసుకోవాలంటే గత ప్రభుత్వంలో లాగా కష్టాలు పడాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నెలా తలుపుతట్టి అందజేసేవారు



ప్రతి నెలా ఠంచన్‌గా వలంటీర్ పింఛన్ తీసుకువచ్చి తలుపుతట్టి మరీ అందజేసేవారు. ఈ నెల ఇంతవరకు వలంటీర్ రాలేదని తెలుసుకోగా వలంటీర్లను పింఛన్ ఇవ్వవద్దని చెప్పారని తెలిసింది. టీడీపీ నేతలు వారి రాజకీయాల కోసం మా వంటి వృద్ధులను ఇబ్బంది పెట్టడం తగదు. ఈ వయస్సులో నేను సచివాలయంకు వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. అక్కడ ఎంత సేపు పడుతుందో తెలియదు. చంద్రబాబు ఓట్ల కోసం ఏం చేసుకున్నా పర్వాలేదు కానీ మా వంటి వృద్ధుల జీవితాలతో ఆడుకోవడం సరికాదు. వచ్చే పింఛన్‌తో మందులు కొనుక్కుని గౌరవంగా జీవిస్తున్నాను. వలంటీర్ల సేవలను నిలిపివేయడం భయాందోళనలు కలిగిస్తున్నాయి. చంద్రబాబు పింఛన్‌దారుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

– సాసుబిల్లి పొరయ్య, దుర్గాపురం

అనారోగ్యంతో నడవలేని పరిస్థితి



బావాజీపేటకు చెందిన లావేటి మురళి అనారోగ్య పరిస్థితుల్లో కనీసం నడవలేని స్థితిలో ఉన్నాడు. ప్రతి నెలా వలంటీర్ పింఛన్ తీసుకువచ్చి ఇంటి వద్దనే అందజేస్తున్నారు. తల్లితండ్రులు లక్ష్మణరావు, లక్ష్మి పండ్ల వ్యాపారం చేసి వచ్చే సొమ్ముతో పాటు మురళికి వచ్చే పింఛన్‌తో జీవనం సాగిస్తున్నారు. కనీసం కదల్లేని స్థితిలో ఉన్న తన కొడుకుని ఇప్పుడు సచివాలయం వరకు ఎలా తీసుకువెళతామని తల్లితండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇరుకు మెట్లతో కూడిన మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్నామని కనీసం మురళిని కిందకి తీసుకురావడం కూడా కష్టమేనని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ సేవలను ఎన్నికల పేరుతో అడ్డుకోవడం వల్ల తమలాంటి వారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని అంటున్నారు.

– లావేటి మురళి

వలంటీర్ ఎంతో సాయం చేశారు



ప్రతి నెలా ఠంచన్‌గా ఒక్కటో తేదీన వలంటీర్ కిరణ్మయి పింఛన్ తీసుకు వచ్చి అందజేస్తుంది. పింఛన్ డబ్బులతోనే జీవనం సాగిస్తున్నాను. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు వలంటీర్ల ద్వారా పింఛన్ ఇవ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ఒక్క పింఛన్ ఇవ్వడమే కాకుండా కోవిడ్ సమయంలో సైతం వలంటీర్ మాకు ఎంతో సాయం చేశారు.

– దూబా రమణమ్మ, బావాజీపేట

ఆటోకి రూ. 200 కావాలి



నా పేరు షేక్ నూర్జహాన్. నా రెండు కాళ్లు కొన్ని సంవత్సరాల క్రితం సచ్చుపడిపోవడంతో ఇద్దరి మనుషుల సాయం లేకుండా ఎక్కడికి కదలలేను. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నాను. గతంలో పింఛన్ తీసుకోవడం కోసం ఇద్దరు వ్యక్తులు మోసుకొని ఆటోలో తీసుకువెళ్లి తెచ్చేవారు. ఆటోకి రూ. 200 కావాలి. ఎండైనా, వానైనా గంటల తరబడి అక్కడే కూర్చొని పింఛన్ తీసుకోవాల్సి వచ్చేది. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే తలుపుతట్టి పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు వలంటీర్లను పింఛన్ ఇవ్వొద్దని ఆపివేయడం వల్ల మా కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. ఈ మండుటెండల్లో మాలాంటి వారికి ఇటువంటి చర్యలు పెద్ద శిక్ష.

– షేక్ నూర్జహాన్, సింగ్‌నగర్

పింఛన్‌పైనే మేము ఆధారపడ్డాం



నా పేరు కంచం వెంకటపాండురంగారావు. నేను, నా భార్య ఇద్దరం ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే ఆధారపడి బతుకుతున్నాము. ప్రతి నెలా ఒకటో తేదీన ఇచ్చే పింఛన్ కోసం ఉదయం నుంచి ఎదురు చూస్తున్నాం. ప్రతి నెలా వచ్చే వలంటీర్ రాకపోవడంతో ఆరా తీశాము. సచివాలయాల వద్దకు వెళ్తే పింఛన్లు ఇస్తారని చెప్పారు. నేను సరిగా నడవలేను. ఈ నెల వలంటీర్ లేకపోవడం బాధగా ఉంది. ఇద్దరం మందులు కొనుక్కోవాలి, అద్దె కట్టుకోవాలి. నడవలేని, ఆధారం లేని మాలాంటి వారిపై కరుణ చూపి వలంటీర్ పింఛన్ అందించేలా చూడాలని ప్రాధేయపడుతున్నాం.

– కంచం పాండురంగారావు దంపతులు, సింగ్‌నగర్

సంస్కృత సంభాషణ శిబిరం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన వేద పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి సంస్కృతి సంభాషణ శిబిరం ప్రారంభించారు. పోరంకిలో వేద పాఠశాలలో సంస్కృత భారతి ఈ శిబిరాన్ని నిర్వహిస్తోంది. దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సంస్కృత భారతి ట్రస్ట్ కార్యదర్శి, సంచాలకులు డాక్టర్ యూవీ రమణమూర్తి, సంస్కృత భారతి ఆంధ్ర బాల కేంద్ర ప్రముఖ్ అరుణశ్రీలు ప్రారంభించారు. పది రోజుల పాటు విద్యార్థులకు సంస్కృత భాషపై ప్రాముఖ్యత, ఆవశ్యకత, అమ్మవారి సుప్రభాతం గురించి తెలియజేస్తారని రమణమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులకు సంస్కృత పుస్తకాలు, అమ్మవారి సుప్రభాతం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేద పాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్ముఖేషశాస్త్రి, ఈఈ ఎల్.రమాదేవి, డీఈ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. పోతిన వీర నారాయణ జ్ఞాపకార్థం సోమవారం బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేశారు.

కారు ఢీ.. యువకుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కారు ఢీకొని యువకుడు గాయపడిన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం కొత్తవంతెన ప్రాంతానికి చెందిన అమరా వెంకటేష్ తన బైక్‌పై వెళ్తుండగా, వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. వెంకటేష్ మణికట్టుకు, తలకు గాయం కావడంతో వెంటనే 108లో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: యనమలకుదురులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. లంబాడీపేటకు చెందిన జటావత్ భాను అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 10 మద్యం సీసాలు, రూ.100 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.